కథానిక

# తారుమారు

ఆర్. యం. చిదంబరం

"కమలా! కమలా" అని పిలుస్తూనే ఇంట్లో అడుగు పెట్టాడు రవణ.

"అమ్మా! అన్నయ్యొచ్చాడే!" అంటూ ఛెంగున తనదగ్గరకు చెల్లాయ్ పరుగెత్తుకొస్తుందన్న రవణకు కొండంత నిరాశయింది. ఆనందమంతా దిగజారిపోయింది. వాళ్లేకూడా ఎవరూ కనిపించలేదు.

కొడుకు కంఠాన్ని గుర్తుపట్టిన తల్లి వంటింట్లోంచి వచ్చింది. బహుశా కమల ఆడుకోటానికి పోయుంటుందనుకున్నాడు. ఆటలంటే దానికి మహాచెడ్డ సరదా.

"వచ్చావా బాబూ! ఓ కార్డుముక్క రాసి పడేశావు కాదు. అయ్యో! ఎలా చిక్కిపోయావో! త్వరగా పెళ్ళిచేసుకోమంటే ససేమిరా విన్నావు కాదు..."

ఆ గొడవలో పడితే తల్లి సంభాషణ ప్రవాహంలా సాగిపోతుందని రవణకు తెలుసు.

"కమలేదమ్మా?" అనడిగాడు.

"ఆ గదిలో పడుకుందిరా" అంది విచారం కనబరుస్తూ.

"ఇప్పుడేం నిద్రమ్మా?" రవణ నవ్వాడు.

"నిద్రకాదురా బాబూ!... జ్వరమొచ్చింది. పొద్దుట్నుంచి వళ్లు కాలిపోతోంది."

తల్లికళ్ళల్లో దూరంగా నీటిఛాయలు కనిపించేసరికి రవణ కాందోళన అధికమైంది. ముద్దుచెల్లెల్ని చీమ కుట్టినా సహించడు. ఆ జ్వరమేదో విషజ్వరమయ్యుంటుందనుకున్నాడు. ఎడంచేతిలో వున్న పెట్టె-కుడిచేతిలో వున్న సంచీ బరువుగా కనిపించాయి. ప్రేమతో తీసుకొచ్చిన గులాబీపూలు, మల్లెపూలు అతన్ని వెక్కిరించాయి. అవి రెండూ అక్కడ పడేసి లోపలికి పరుగెత్తాడు. కమల కళ్లుమూసుకుని పడుకుంది. రవణ మంచందగ్గర కూర్చున్నాడు.

"కమలా!...కమలా!" అని పిలిచి కదిపాడు. నెమ్మదిగా కళ్లుతెరచి కాసేపలాగే చూసింది.

"వచ్చావా అన్నయ్యా!...మరి నాకు పూలపరికిణీ తీసుకొచ్చావా? నాన్నను ఉత్తరంలో రాయమన్నాను. ఆ సీత కట్టుకుంది ఎంతబాగుందనుకున్నావు? నాకులేదని నన్ను వెక్కిరించిందికూడా."

హీనస్వరంలో పలికినా ఆ మాటల్లో ఛలాకీతనం కనిపించింది. జ్వరంతో వేగుతున్నా చిలిపితనాన్ని వదలనందు కతనికి నవ్వొచ్చింది.

నిజమే! వారంరోజుల క్రితం కమల పూల పరికిణీకోసం పీక్కుతింటోందని నాన్న రాశాడు. పెట్టెలో వున్న రెండు పరికిణీలు అతనికి కనిపించాయి. కళ్ళు చెమ్మగిల్లాయి.

"తీసుకొచ్చాను కమలా! రిబ్బన్లుకూడా తీసుకొచ్చాను- ప్లాస్టిక్‌వి, సిల్కువి, జెండారిబ్బన్లు" కమల పేలవంగా నవ్వింది.

ఇదంతా చూస్తూ వంటసంగతి మరిచిపోయి నిలబడిపోయింది తల్లి.

"డాక్టరు మందిస్తున్నాడామ్మా?" ఆ ప్రశ్న ఇంతవరకు అడగనందుకు నొచ్చుకున్నాడు.

"ఈమధ్య రెండునెలలనుంచి ఇలాగే వస్తోంది. ఇది అయిదోమాటో-ఆరోమాటో. ఒకటిరెండుసార్లు డాక్టరు వచ్చాడు, ఇంజెక్షనిచ్చాడు. అప్పటికి తగ్గింది. కాని మీ నాన్న నా మాట చెవిని వేసుకుంటేకదూ? అదే తగ్గుతుంది. వీళ్ళకు డబ్బెక్కణ్ణుంచి తేను? అంటారు. ఆయనెవరో కాంపౌండరట. జరమొచ్చినప్పుడల్లా మందు పొట్లాలిస్తూంటాడు. ధర్మాత్ముడు...అతనిచేతిచలవో...మరి మందు మంచిదో-తక్కున తగ్గుతూంటుంది...దానికేపూరునీళ్ళు పడవేమో!" అని ముగించింది.

ఇది వినేసరికి రవణకు ఐస్‌టబ్‌లో మునిగినట్టయింది. నాన్నమీద భలేకోపమొచ్చింది ఇంటి గొడవలసలు పట్టించుకోరు. ఏళ్ళు మీరుతున్న కొద్దీ వేదాంతం ఎక్కువవుతోంది.

"మరి నాకన్నా వుత్తరం రాయలేకపోయారూ?" అన్నాడు కోపంగా.

వచ్చీరాగానే ఈ రభస సృష్టిస్తున్నందుకు తల్లి విసుక్కుంటూ "అసంటే నీకుప్రాణం. ఇక వుత్తరంరాస్తే వుద్యోగానికి రాజీనామా యిస్తావని ఓ వంకభయం. అనవసరంగా బెంబేలైపోతావని మరోవంకభయం...అందుకే రాయలేద"ని-ఈ విచారణకు అంతముండదని తల్లి వంటింటోకి పోయింది.

తండ్రిని దుయ్యబట్టటంకూడా న్యాయం కాదనుకున్నాడు. అతను మాత్రం ఏంచేస్తాడు? వచ్చేజీతం తక్కువ-వ్యయమెక్కువ-అరవచాకిరీ చేసినా అందుకుతగ్గ ఫలితం కొంతైనా లేదు-డాక్టర్లకు పొయ్యాలంటే ఎక్కణ్నుంచివస్తుంది?

"వెధవలు ఎంతకని చావను?...ఓ రాజీనామా పడేస్తే పీడాపోయె-ప్రతివాడికీ లోకువే. పెద్దవాణ్ణని గౌరవముండొద్దూ?...నిన్నొచ్చినవాడూ నామీదెగరటమే?"

తండ్రి గొణుక్కుంటూ రావటం చూశాడు రవణ. ఒకసారి బావురుమనాలనిపించింది. తలంతా నెరిసిపోయింది. పంచనిండా ప్యాచీలు. బాగా చిక్కిపోయాడు. గెడ్డం పెరిగిపోయింది. చొక్కానిండా కుట్లు. తనుఎంత చితికిపోయినా సంసారాన్ని ఈడుస్తున్నాడు.

"ఎవరది?... ఆ... రవణా! ఎప్పుడోయ్ రావటం? వంట్లో ఆరోగ్యంగా వుంటోందా? ఒంటరిగా వుంటున్నావు? నీ సుఖం చూసేదెవరు? నిన్ను నువ్వే కనిపెట్టుకోవాలి" అన్నాడు తండ్రి.

"మళ్ళీ కమలకు జ్వరమొచ్చిందండి-" అని వార్త అందించి నీళ్ళకాఫీతోబాటు- రవణకసలు పచ్చి మంచినీళ్ళుకూడా దిగేలాలేను.

"పదిరోజులేగా అవుత!..మళ్ళీ దండెత్తింది!" కాఫీతాగటానికన్నా మనశ్శాంతిలేదు.

"ఎవరో కంపౌండరు మందిస్తున్నాడటకదూ నాన్నా?"

"అవునోయ్ డాక్టరు మూర్తిగారి నెరుగుదువు కదూ? ఆ...నువ్వెరగవులే-ఆయనొచ్చి నాలుగు నెలలేగా అవుత. ఆయనదగ్గర నారాయణని ఓ కంపౌండరున్నాడు. అతనికీ నాకూ స్నేహం కలిసిందిలే-అతన్నికూడా నువ్వెరగవు."

"ఇప్పుడాయనదగ్గరకు వెడతారా?"

"వెంటనే వెళ్ళండి" అనలేక అడిగాడు.

"ఇక్కణ్నుంచి ఇండియా అంతా ఇచ్చినా కదిలేదిలేదు. నా కాళ్లు లాక్కుపోతున్నాయ్. కళ్లుతిరుగుతున్నాయ్ ... అతను కనిపిస్తాడులే-చెబుతాను ఈ మధ్య వంట్లో ఏంబాగుండటం లేదు రవణా-ఏంచేయను?...నువ్వేం బెంగ పెట్టుకోకు-తగ్గిపోతుందిలే దానికిది మామూలేగా. దానిది గట్టిశరీరం కాదు-అందుకే యీబాధ."

కమలకు జ్వరమొస్తే వీళ్ళంతా వేదాంతం మాట్లాడటం - నిర్లక్ష్యం చేయటం - రవణకు రుచించలేదు.

"పోనీ-నేనే వెడతాను. మూర్తిగారి ఆసుపత్రెక్కడో చెప్పు."

కళ్ళ జోడు సవరించుకున్నాడు తండ్రి.

"సరే-వెళ్ళు. కాని అక్కడ డాక్టరుకూడా వుంటాడు. ఆయన చెవినపడినా - అనుమానించినా-కొంప మునుగుతుంది. నీకు నారాయణెవరో తెలియకపోతే ఎవరినన్నా అడుగు-నేను మందిమ్మన్నానని చెప్పు...మెయిన్‌రోడ్డంట తిన్నగా వెళ్ళి కుడిపక్కకు తిరిగితే కనిపిస్తుంది..."

ఎక్స్‌ప్రెస్‌లా వెళ్ళాడు. డిస్పెన్సరీదగ్గరకు వచ్చేసరికి అయోమయంగా వుంది. ఎంతోమంది వచ్చిపోతున్నారు. ముగ్గురు నలుగురు కంపౌండర్లున్నారు. ఎవరినడగటం? నాన్న యిచ్చిన హెచ్చరిక మెదడులో మెదలుతూంది.

"డాక్టరుగారున్నారా?..." అనడిగాడు బయటికి వస్తున్న ఓవ్యక్తిని-ఉన్నట్టుగా తెలుసుకొని-మరి కొంచెం జాగ్రత్తగా వుండాలనుకున్నాడు రవణ-ఆదారినేపోతున్న పాతమిత్రుణ్ణి పిలిచాడు.

"ఏమోయ్ రవణా! ఎక్కడుంటున్నావు?... బాగున్నావా?... పెళ్ళి-అదీ అయిందా?" అని యింకా ఏదో అడగబోయాడు మిత్రుడు.

"అవంతా తరువాత చూద్దాం-కంపౌండరు నారాయణగారెవరో తెలుసా?" అని అనడిగాడు.

"అదుగో...ఆ కిటికీదగ్గరున్నాయనే - టక్ చేసుకున్నాడు-చూశావా? ఆయన" అన్నాడు.

"మళ్ళీ కనిపిస్తా"నని కిటికీదగ్గర కెళ్ళాడు-

కాని అనుమానం కలిగింది. "కొంపతీసి ఆయనే డాక్టరైతే?"

"కాంపౌండరు నారాయణగారు మీరేనాండి?" అనడిగాడు.

"అవును...ఏమండీ?" అనడిగాడాయన.

"నేను నరసింహంగారబ్బాయినండి. మా చెల్లాయికి మీ రప్పుడప్పుడు జ్వరం వచ్చినప్పుడు మందిస్తూంటారట కదండీ!......పొద్దున్నే మా చెల్లాయికి జ్వరం వచ్చిందటు-వళ్లు సలసల కాగిపోతోంది. మిమ్మల్నడిగి మా నాన్నగారు మందు తీసుకురమ్మన్నారు" అన్నాడు.

"అలాగా!...పాపం!...చాలా సార్లువచ్చినట్లుంది-మస్తున్నా-అప్పటి కప్పుడు తగ్గటమే కాని మళ్ళా యథాప్రకారంగా తలెత్తుతోంది. ఇక్కడే వుండండి - మందు తీసుకొస్తాను-అని లోపల కెళ్ళాడు. వచ్చినపని సఫలమైనందుకు రవణ దేవుడికి దండం పెట్టాడు. కాని యిటువంటి సహృదయులకు ముందు నమస్కరించాలనుకున్నాడు. నారాయణ మూడు మందుపొట్లాలు రవణ చేతిలో వుంచి "పూటకో పొట్లం యివ్వండి ఈ పౌడరు నోట్లో వేసుకుని కొంచెం వేడినీళ్ళు తాగమనండి...కాఫీ రొట్టె ఇవ్వండి...తగ్గిపోతుంది" అన్నాడు.

"ఇదేం జ్వరమంటారు? అస్తమానం వస్తోంది!"

"అబ్బే! మీరేం గాభరాపడకండి. ఆర్డినరీ ఫీవర్..."

"మీకు చాలా థాంక్స్" అంతకంటె అభినందించటం చేత కాక నమస్కరించి యింటికొచ్చాడు రవణ-కమల చేత అతి కష్టంమీద ఆ మందు తినిపించాడు.

* * *

మర్నాడు కమలకు జ్వరం తిరుగుముఖం పట్టకపోయేసరికి రవణకు మతిపోయినట్టయింది. మరో రోజాగాక డాక్టర్ని తీసుకువద్దామని తండ్రి నచ్చజెప్పాడు. ఆర్థికబాధా సంద్రం ఎప్పుడూ అడ్డు తగులుతూంది.

ఆ సాయంత్రం రవణ డిస్పెన్సరీదగ్గరకు వెళ్ళేసరికి నారాయణలోపల్నుంచి పరుగెత్తుకొచ్చాడు. రవణ ఆశ్చర్యంలో దాక్కుండిపోయాడు.

"ఎలాగుంది మీ చెల్లాయికి?"

"ఏం తగ్గలేదండీ. అలాగే ఉంది...మీరలా పరుగెత్తుకొచ్చారే?...నేనేమన్నా తప్పుగా ప్రవర్తిస్తున్నానా?" అనడిగాటు

"అబ్బే!... అదేం లేదు. మీరు రావటం... మాట్లాడటం డాక్టరుగారికి తెలిస్తే బాగుండదని నేనే వచ్చేశాను. మీరికముందు ఈ టైముకు ఇక్కడ వచ్చి నిలబడండి. నేనే వస్తా. ఆలస్యమైతే వెయిటింగ్ రూమ్‌లో కూర్చోండి. తెలిస్తే ప్రమాదం. ఈసారి మరో మందిస్తాను లెండి. మరేం భయపడకండి. ఇది మామూలు జ్వరమే - వీలైతే వోసారి వస్తానులెండి..." అని లోపలకెళ్ళి సీసాలో మందిచ్చాడు.

"కాఫీమాత్రం ఎక్కువివ్వకండి... ఇప్పట్లో అది మంచిదికాదు."

రవణ నమస్కరించి ఇంటికి వచ్చేశాడు.

"వాడికేం తెలుస్తుంది? మీరే ఆ కాంపౌండరు కనిపించినప్పుడు మంచి మందిమ్మనిచెప్పండి. ఓ వేళ డాక్టరునే తీసుకురావాలేమో!...ఎలా తెలుస్తుంది?" అని తల్లి అడిగింది.

"అతను నాకు వారం రోజుల్నుంచి కనిపించటము లేదు. చెప్తాను" అన్న తండ్రి సమాధానం విన్న రవణకు గాభరా ఎక్కువైంది.

"ఆ కాంపౌండరు ఎప్పుడూ బిజీగావుంటాడే నాన్నా? మాట్లాడ్డానికి కూడా తీరికలేకుండా."

"మరేం-మనం సొమ్ము రాసులుగా పోస్తున్నామని" అని తండ్రి విసుక్కున్నాడు.

వారంగడిచింది. కమలకు జ్వరంతగ్గిపోయింది. పూలపావడా కట్టుకుని వీధిలో ఆడుకుంటుంటే రవణ చూస్తున్నాడు.

ఇంట్లోకి ధుమధుమలాడుతూ వచ్చాడుతండ్రి "రవణా!" అని పెంకులెగిరిపోయేట్టు పిలిచాడు.

"కొంపతీశావురా... నా పరువు తీశావు—మర్యాద గంగలో కలిపేశావు. నీ మూలంగా నేను నానా బూతులు తినాల్సి వచ్చింది" అనరుస్తున్నాడు.

రవణ ఏమీ అర్థంకాక అయోమయంగా చూస్తూ "అసలు సంగతేమిటి నాన్నా?" అనడిగాడు. వంటింట్లోంచి తల్లి కూడా పరుగెత్తుకొచ్చింది. వీధిలో ఆడుకుంటున్న కమల కూడా వచ్చింది.

"నువ్వు మందు తీసుకొచ్చింది నారాయణ దగ్గిర కాదురా-తిన్నగా డాక్టరు మూర్తిదగ్గిరకే వెళ్ళొస్తున్నావ్-ఆయనే నారాయణనుకున్నావు. మోసంచేసి నారాయణ చేస్తున్న ఈ పనికి అతను వుద్యోగం వూడింది. నీ ఉపకారం చేసినందుకు నా కొంప ఇలా తవ్వుతావా?...నా సంసారం ఏం కావాలి? ఇదా నీ స్నేహితం? అని నామీద పడేడుస్తున్నాడు. నేనే ఇదంతా చెప్పానని అతని నమ్మకం...మూర్తి ఎంత నాటక మాడాడో చూశావా?" అంటూ పళ్ళు పటపట కొరికాడు. ఇంకేదో అందామని తలెత్తేసరికి రవణక్కడ లేనే లేడు.

అతనికింకక్కడ వుండటానికి మనస్కరించ లేదు. ఆ సాయంత్రమే వెళ్ళిపోదామని మిత్రుడితో చెప్పటానికి వెడుతున్నాడు. డిస్పెన్సరీ దాటి చరచరా నడిచిపోతూంటే మూర్తి చప్పట్లు చరిచి పిలిచాడు. రవణకి వెళ్ళక తప్పిందికాదు.

ఎప్పట్లాగ నవ్వుతూ "మీ చెల్లాయి జ్వరమంతా తగ్గినట్టేనా?" అనడిగాడు.

"మీ దయవల్ల తగ్గిందండి డాక్టరుగారూ!... కాని నా మూలంగా నారాయణగారి వుద్యోగం పోయింది. ఆయన మమ్మల్ని తరతరాలవరకూ తిడుతున్నాడు. మీరు కనికరించి - క్షమించి అతన్ని కాంపౌండరుగా వుండనివ్వండి" ఉద్వేగంతో ప్రార్థించాడు రవణ.

మూర్తి నవ్వేశాడు.

"అందరు డాక్టర్లు ఒక్కలాగుండరండి. నేను మీవంటివారి దగ్గర దమ్మిడీ అయినా తీసుకోను, తెలిసిందా? నారాయణ మీకు మంచే చేశాడు. అది తప్పనను. కాని స్వలాభంకోసం ఈ పని కొనసాగిస్తే నా డిస్పెన్సరీ ఎగిరిపోదూ?"

రవణ మాట్లాడలేక నమస్కరించి వచ్చేశాడు. ఇంత రభసకూ కారకుడైన ఆనాటి మిత్రుడు కనిపించేసరికి రవణ కతనికి పీకపిసికి పక్కనే వైతరణిలా ప్రవహిస్తున్న సైడు కాలువలో పారేయాలనిపించింది.

"ఏం బ్రదర్? కిటికీదగ్గరున్నాయనే కాంపౌండరు నారాయణగారన్నావుకదూ?" అనడిగాడు.

"అవును"

అతని ధైర్యాన్ని చూసేసరికి రవణకు మతిపోయినట్టయింది.

"ఆయన డాక్టరు మూర్తిగారు కదూ?" అనడిగాడు.

"బయట నిలబడింది మూర్తి-లోపలి కిటికీ దగ్గర మందు కలుపుతున్నది నారాయణ. నేను లోపలున్నాయన కాంపౌండరన్నానుకాని మూర్తిగారినన్నానా?" అని సూటిగా ప్రశ్నించాడు-రవణకు తల గిర్రున తిరిగిపోయింది.

---

కొరియా ప్రజల సంగీతప్రియత్వం అపరిమితమని ప్రతీతి. అలాగే వాళ్ళ జాతీయాభిమానం, ధైర్యసాహసాలు, ఓర్మి, అవీ అపరిమితమైనవే. విదేశీయుల దండయాత్రలవల్ల అన్నిసార్లు విధ్వంసనానికీ, సర్వనాశనానికీ గురియైనదేశం చరిత్రలో యింకొకటిలేదు. శతాబ్దాలుగా ఆ దేశం అనుభవిస్తున్న విదేశ యుద్ధోన్మాదుల వినాశన కార్యక్రమాలలో నేడు జరుగుతున్న కర్మకాండ ఒకటి.

మొట్టమొదట-మధ్యయుగానికి పూర్వం చైనీయులు దండెత్తారు. ఆ తరవాత జెంగిస్‌ఖాన్ మంగోల్ సైన్యాలు దండెత్తాయి; అటుతరవాత క్రీ.శ.1592లో జపాన్‌వాళ్లు దాడిచేసి కొరియాలోని ప్రతిగ్రామాన్నీ దగ్ధపటలం చేశారు. మళ్లీ సరిగ్గా అలాంటి కార్యక్రమమే 1636లో చైనాదేశపు మంచూలు సాగించారు. 1910లో జపాన్ సామ్రాజ్యవాదులు కొరియాను ఆక్రమించుకున్నారు. 1945లో, మొన్నటి ప్రపంచయుద్ధం ముగిశాక రష్యావారు ఉత్తరకొరియాను ఆక్రమించారు. 1950లో తిరిగి యుద్ధకాండ ప్రారంభం. అయినా నేటికీ యింకా ఒక జాతిగా, దేశంగా కొరియా నిలిచి ఉన్నదంటే, చరిత్రలోని మహాద్భుతాలలో అదొకటి.